అడల్ట్స్ ఓన్లీ కథ

# మార్పు

''నీ కొడుకు వరస నాకేం నచ్చటం లేదు'' భార్య సుజాతతో అన్నాడు రామారావు.

ఆమె ఏమయింది అన్నట్లుగా చూసింది.

రవి ఒక్కగానొక్క కొడుకు, ముద్దుల బిడ్డడు, మురిపాల కన్నడు, వరాలమూట, వజ్రాలగని, ఇంటి దీపం, కంటి వెలుగు. ఇరవై రెండేళ్లు. బి. టెక్ పాసయి, ఎం. టెక్ సీటు కోసం ఎదురుతెన్నులు చూస్తున్నాడు.

రామారావు రుసరుసలాడుతూనే ఉన్నాడు.

తల్లిదండ్రులు కొడుకును ఎప్పుడూ ఏమీ అనరు. రవి వాళ్ల మాటను జవదాటడు.

ఇవాళ తండ్రి కోపంగా ఉన్నాడు. ఏమయి ఉంటుంది అని సుజాత ఆలోచనలో పడింది.

రామారావు కాలుగాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

రవి రూంలోకి నెమ్మదిగా పోయి కోపంగా, దూకుడుగా వెనుదిరిగి వస్తున్నాడు.

''వీడి రూం ఎప్పుడైనా చూశావా?'' అని కసురుకొన్నారు.

నీట్‌గా శుభ్రంగా సర్ది ఉంచుకొంటాడే అని ఆమె భావిస్తున్నట్లు గుర్తించి 'శుభ్రంగానే ఉంది' అని చికాకు పడ్డాడు.


మరింకెందుకు గొడవ అని భార్య అంటుందనుకొని ''నీకలాగ్గే ఉంటుంది'' అని కయ్యిమన్నాడు.

''వాడి టేబులు చూశావా? టేబులు డ్రాయర్లు చూశావా?'' అని అటూ ఇటూ తిరిగాడు. 'చూడలేదు' అంటుందనుకొని, ''చూడవు! ఎందుకు చూస్తావు? చూడవు'' అని చిందులు వేశాడు.

భర్త రవి రూంలోకి పోతుంటే ఏమయిందోనని ఆమె కూడా వెంటపోబోయింది.

''చాల్లే దరిద్రం'' అని ఆగి, ''నువ్వేం రానక్కరలేదు'' అని కసిరి, ''నేనేం పోనక్కరలేదు'' అని ఆగి ఎగిరి వెనక్కు వచ్చాడు.

ఏమయింది అని ప్రశ్నిస్తుందని భావించి, ''ఏమయిందా? ఏమి ఎందుకు కాదు? ఏమయినా అవుతుంది.



ఎందుకు కాదు, కారానిదే అయింది'' అన్నాడు.

రామారావుకు నియమనిష్ఠ లెక్కువ. భక్తిపూజలు మెండు, గుళ్లు, గోపురాలు, పుణ్యక్షేత్రాలు. తీర్థాలు, కొండలు, కోనలు దేవుళ్ల మొక్కులు దండిగానే ఉన్నాయి.

పాపం-పుణ్యం, పవిత్రం- అపవిత్రం, మంచి-చెడు, నీతి-అవినీతి, న్యాయం-అన్యాయం మధ్య తేడా స్పష్టంగా తెలుసు. ధర్మం ఆచరిస్తాడు. అధర్మం నిరసిస్తాడు.

సుజాత భర్త చెప్పినట్లు వింటుంది. చేయమన్నట్లు చేస్తుంది. అతనే దంటే ఔను, కాదంటే కాదు.

ఎప్పుడూ అతని మాట మీరదు. ఎదురు మాట్లాడదు. భర్తకు అన్ని విధాలా అనుకూలమని పూజలు, వ్రతాలు, గోములు ఎక్కువ. అన్ని అందాల భర్తకు తగ్గ భార్య. సీతయినా గీత దాటుతుందేమో కానీ సుజాత గీత దగ్గరకు కూడా రాదు.

వాళ్లు చూసే సినిమాలు తక్కువ. చూస్తే పౌరాణికాలు, చారిత్రకాలు, జానపదాలు చూస్తారు. సాంఘికాలు చూడరు. ఈమధ్య వస్తున్న వాటిని అసలు చూడరు. వాటిలో అశ్లీలం ఉంటుందని రామారావు విశ్వాసం.

ఆచార్య కొలకలూరి ఇనాక్

భార్యకు నలభై, భర్తకు నలభై అయిదు.

యం.ఆర్.వో. కలెక్టరు అవుతానన్న నమ్మకం. జీపులో ఆఫీసుకు పోతూ వస్తూ గోడల మీద సినిమా బొమ్మలు, ఆడపిల్లల అర్ధనగ్న, అసలు నగ్న చిత్రాలు చూసి, వాటిని బేన్ చేయలేక, చేయించలేక తనలో తాను కుమిలిపోతూ ఛీఛీ, తూథూ అనుకొంటూ ముఖం అటు తిప్పుకొని వెళతాడు కానీ, అందమైన తన భార్య ముఖం అదే పనిగా తదేక ధ్యానంగా చూడటం మాత్రం చాలా ఇష్టపడతాడు. అంతగా భర్త అనురాగం ఆదరణ పొందుతున్న సుజాత భర్తకు ఏం కావాలో అన్నీ వండి వార్చటం వడ్డించటంలో, సమకూర్చటంలో సర్దుబాటు చేయటంలో, సర్వశక్తులు సమకూర్చుకొంటుంది.

అనురాగమయమైన వాళ్ల జీవితాంకురం రవి. అతన్ని వాళ్లు తమ ఇష్టాలకు అనుకూలంగా పెంచి పెద్ద చేశారు.

ఆడపిల్లలు వాళ్లకు లేకపోవటం వల్ల అయిదేళ్ల దాకా రవిని ఆడపిల్లలాగా, గౌన్లు, జడలు, రిబ్బన్లు, పూలు, బొట్టు కాటుకగా పెంచారు.

రవిని తల్లిదండ్రులు ఆడపిల్లలా పెంచుతామంటే తలూపాడు. నిక్కరు వేస్తామంటే తలూపాడు. పేంటు వేస్తే తలూపాడు.

లెక్కలు, సైన్సు చదువుకోమంటే చదువుకొన్నాడు. ఎంసెట్ రాయమంటే రాశాడు. రేంక్ తెచ్చుకోమంటే తెచ్చుకొన్నాడు. బి.టెక్ చేయమంటే చేశాడు.

తల్లిదండ్రుల ఇష్టాన్ని అనుసరించి పెరిగాడు పెద్దవాడయ్యాడు. చదువుకొన్నాడు. తండ్రి మాట చాటు మనిషిగా, తల్లి కొంగు చాటు కొడుకుగా గుట్టుచప్పుడు కాకుండా జీవిస్తున్నాడు.

అల్లాంటి కొడుకు ఎంతకు బరితెగించాడు అనుకొంటున్న రామారావు పైకి అనేశాడు. ఏమయిందో తెలియక విలవిల్లాడుతూ ఉంది సుజాత.

''వాడి రూంలో ఏం బొమ్మలున్నాయో చూశావా? నీ ముద్దుల కొడుకు ఏం పుస్తకాలు చదువుతున్నాడో చూశావా?'' అని అడిగాననుకున్నాడు. ఏమిటీ అన్నట్లు ఆమె చూసింది అనుకొన్నాడు. 'ఛీ ఛీ' అన్నాడు. ఆమె తలెత్తి చూసింది. ''ఏమీ లేదు'' అన్నాడు.

రవి తమ ఎదుట కూర్చోడు. టీవీలో వార్తలు వస్తుంటే చూస్తుంటే కూడా చూడడు. పత్రికలు కూడా పట్టించుకోడు. సినిమాలకు అసలు పోడు. అలాంటి వాడు సిగరెట్లు తాగాడన్నా బ్రాందీ తాగాడన్నా ఆడపిల్లల్ని పలకరించాడన్నా తాను నమ్మడు. తన భార్య నమ్మదు. అంత బుద్ధిమంతుడు. ఆడపిల్లల్లాగా వంచిన తల ఎత్తకుండా కాలేజీకి పోతాడు, వస్తాడు. అయితే ఇల్లు కాకపోతే కాలేజీ. ఇంతే రవి జీవితం.

''మరి ఏమిటీ విపరీతం?'' పైకి అనేశాడు. భర్త ముఖంలోకి తదేకంగా చూసింది సుజాత.

ఆఫీసు గొడవలు ఆఫీసులో వదిలి వస్తాడు రామారావు. ఫైళ్లు కూడా ఇంటికి తేడు.

ఇంటికి వస్తూ పూలు తెస్తాడు. పళ్లు తెస్తాడు.

సాయంకాలాలు కొడుకుతో భార్యతో నీతి న్యాయం భక్తి పూజ గూర్చి మాట్లాడతాడు. పవిత్రత పాతివ్రత్యం గూర్చి భగవద్గీత ఏం చెప్పిందో వివరిస్తాడు.

తొమ్మిదైతే మంచమెక్కుతాడు. పదైతే నిద్రపోతాడు. ఆరింటికి లేస్తాడు. గుళ్లు గోపురాలు తిరుగుతాడు. తొమ్మిదికి స్నానపానాలు పదికి ఆఫీసు. రామారావు గొప్ప గడియారం.

భార్యగానీ, కొడుకు గానీ టైం ఎంతయిందో తెలుసుకోవాలంటే రామారావును చూస్తే తెలిసిపోతుంది.

ఎప్పుడూ సాధారణంగా రామారావు చిరాకు పడడు. అటువంటి మనిషి నిలబడలేకుండా కూర్చోలేకుండా ఉన్నాడు.

సుజాత వంటగదిలోకి పోయింది. కాఫీ కలుపుతూ ఉంది. ఇంట్లో కొడుకు లేడు. వచ్చే టైం అయింది.

''ఏం పుస్తకాలివి? ఏం బొమ్మలివి? ఏం రాతలివి? ఏం మాటలివి?'' రామారావు తల పీక్కున్నాడు.

అక్షరాలలో ఇంత అసహ్యమా? అక్షరం అంటే సరస్వతి దేవే కదా! అతడి తల తిరిగిపోతూ ఉంది.

భార్య కాఫీ తెచ్చింది. ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాడు. వేడి మీద వేడి. ఏమయిందో చల్లబడ్డాడు. మౌనంగా మారిపోయారు. మెదలకుండా కూర్చున్నాడు. ఉన్నట్టుండి అడిగాడు.

''రవి రూంకి ఎప్పుడూ పోవా?'' అడిగాడు రామరావు పోవాలని అతడి ఇష్టమో పోకూడదని అభిప్రాయమో అర్థం కాక భర్త ముఖంలోకి చూస్తూ ఉంది. ఖాళీ కప్పు తీసుకుపోయి వంట గదిలో సింకులో వేసి వచ్చింది.

''ఈ గదిలోకి పోలేదా. ఈమధ్య''

ఆమె అబద్ధం ఆడదు. పోయానన్నట్లు తల ఊపింది.

''ఆ పుస్తకాలు, బొమ్మలు చూశావా?'' మళ్లీ అడిగాడు.

అగ్నిపరీక్ష. చూడలేదంటే అబద్ధం. తప్పు. ఆమె తప్పు చేయదు. చూశాను అంటే నాకెందుకు చెప్పలేదు. ఇంత అవిధేయమా, భర్త అంటే అంత చులకనా అంటాడని భయం. ఏం చెప్పాలో తెలియక అవునన్నట్లు కాకుండా కాదన్నట్లూ కాకుండా తల ఆడించింది. అదిరిపడి అడిగాడు.

''చూశావా?'' అంటే చూశాను అన్నట్లు తల ఊపింది సుజాత.

ఎగిరిపడ్డాడనుకొంది. మండిపోతు

## భలే సీన్!

**ఆమధ్య హాలీవుడ్ హీరో రిచర్డ్ గెరె-బాలీవుడ్ భామ శిల్పాశెట్టిని స్టేజ్ మీదే ముద్దుపెట్టుకుని సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే కదా! కొన్ని నెలల గ్యాప్ తరువాత మళ్లీ ఈ ఇద్దరూ టొరంటోలో ఓ అవార్డుల ఫంక్షన్ సందర్భంగా కలిసినప్పుడు- శిల్పాశెట్టి గురించి రిచర్డ్ మాట్లాడుతూ- వ్యాఖ్యాతగారు శిల్ప గురించి బానే చెప్పారు కానీ, ఆమె ఇటీవలే చేసిన ఓ అమెరికన్ నటుడితో చేసిన స్లో డాన్స్ సంఘటన గురించి ఎందుకనో ప్రస్తావించలేదు అంటూ నాటి కిస్సింగ్ సీన్‌ని ఇండైరెక్టుగా మళ్లీ గుర్తుచేసేసాట్ట. అవును మరి! అంత తేలిగ్గా మర్చిపోయే సీనా అది?**



న్నాడనుకొంది. కుప్పకూలిపోతున్నట్లు భావించింది.

''చదివావా?''

చదవలేదు అంటే సంతోషిస్తాడు. చదివాను అంటే ఏమవుతాడు? ఆమె ఆలోచిస్తూ ఉంది.

''చెప్పు! చదివావా?'' రెట్టించాడు. చదివాను అన్నట్లుగా సుజాత తల ఊపింది.

''చదివావా?'' ఏడ్చినట్లుగా అరిచాడు. మనిషంతా ఊగిపోయాడు. ఇవి వాడు చూస్తే చదివితే పాడయిపోడా. వాణ్ణి మనం కాపాడుకోవద్దా. చదవకుండా చేయవద్దా అని అడగాలనుకొన్న రామారావు. భార్య చదివితే ఎట్లా, భార్య పాడయిపోదా, భార్యను కాపాడుకోవడం ఎట్లా అని కంగారుపడుతున్నట్లుగా ఉన్నాడు.

పనిమనిషి వచ్చింది. కసువు ఊడ్చటానికి చీపురు చేత బట్టింది.

భార్యాభర్తలిద్దరూ ఏమీ మాట్లాడకుండా, మౌనంగా మామూలుగా ఉన్నట్లుగా ఉండటానికి తీవ్ర ప్రయత్నంలో ఉన్నారు.

ఏమీ మాట్లాడకపోతే బాగుండదని ''రవి రూం ఊడ్చవద్దు'' అన్నాడు రామారావు. ఆమె ఆ గది ఎప్పుడూ ఊడ్చలేదు.

పనిమనిషి వింతగా, విడ్డూరంగా చూసింది.

రవి తన రూం తానే ఊడ్చుకొంటాడు. తన మంచం తనే సర్దుకొంటాడు. తన వస్తువులు తనే భద్రంగా పెట్టుకొంటాడు.

తల్లిదండ్రులు సాధారణంగా అతడి గదిలోకి పోరు. పనిమనిషికి ఆ గదితో పనిలేదు.

ఆమె వెళ్ళిపోగానే రామారావుకు జ్వరం తిరగబెట్టింది. వేడెక్కింది. వళ్ళు, కుదురుగా కూర్చోలేకుండా ఉన్నాడు.

రవి గదిలోకి ఈ పుస్తకాలు ఎలా వచ్చాయి, వాడివి చదువుతున్నట్లు, నువ్వు తెలుసుకొని కూడా నాకు ఎందుకు చెప్పలేదు అని అడుగుతాడేమోనని సుజాత గజగజ వణుకుతూ ఉంది.

రామారావు ఆమె భయం గుర్తించి కొంచెం శాంతంగా కొంచెం నెమ్మదిగా కొంచెం ప్రేమగా ''ఏం చేద్దాం?'' అన్నాడు.

సుజాత కొంచెం కుదుటపడింది. మీ ఇష్టం అన్నట్లుగా చూసింది అనుకొన్నాడు.

రవి రూంలో పుస్తకాలు అన్నీ అటూ ఇటూ తిప్పితిప్పి చూశాడు గానీ ఏవీ పూర్తిగా చదవలేదు రామారావు.

భర్త, భార్యకు తిండి, బట్ట, నగా నట్రా ఇల్లూ వాకిలి ఇస్తే చాలుననుకొంటాడు అనుకొంది సుజాత.

ఇంకా ఉండవలసిన ఏవో సంగతులు, విషయాలు ఈ పుస్తకాలు చెబుతున్నాయి కాబోలు అనుకొన్నాడు రామారావు.

స్త్రీ శరీర నిర్మాణం, అవయవాలు, వాటి ప్రత్యేకతలు చెప్పే బొమ్మ భర్త చూసే ఉంటాడని ఆమె అనుకొంటూ ఉంది.

ఆ ప్రత్యేకతలకు పరామర్శను ప్రస్తావించినట్లుగా ఈ పుస్తకాలున్నట్లున్నాయి అనుకొన్నాడు భర్త.

తన కోపం తాను కాకుండా ఒప్పుకోడం మరొకరు జీవించాలనుకోవడం కొత్తగా ఉంది అనుకొన్నాడు రామారావు.

స్త్రీకి శరీరం ఉంది, దానికేం కావాలో అదివ్వాలనే ఆయా పుస్తక విషయాలు భర్త చదివి ఉంటాడని సుజాత ఆలోచిస్తూ ఉంది.

అన్ని ధర్మసాధనాలకు ప్రధానమైన స్త్రీ పురుషులు తమ శరీరాలకు ఏం కావాలో అది ఇచ్చి ఏం అవసరమో అది తీసుకొనే సమభాగస్వామ్యంగా ఉండే ప్రజాస్వామ్యాన్ని ప్రస్తావించే పుస్తకాలు చెడ్డవి కావేమో అనుకోసాగాడు రామారావు.


శరీరానికీ, మెదడుకూ ఆకలి ఉంటుంది కదా ఏది ముందు తీరాలని రామారావు ఆలోచిస్తున్నాడో అని సుజాత మధనపడసాగింది.

అనుభూతికీ, ఆలోచనకూ అవసరమైన ఇంధనం అన్ని సందర్భాలలో భార్యాభర్తలకు అందుబాటులో ఉండాలి కాబోలు అనుకున్నాడు రామారావు.

తన ఆలోచనలు తనకు కొత్తగా అనిపించి రామారావు విచలితుడయ్యాడు. తనకు తానే కొత్తవాడుగా అనిపిస్తున్నాడు.

ఆ పుస్తకాలు ఆలోచనే కలిగిస్తాయన్నమాట. అనుకోగానే ఆనందంగా అనిపించింది. అవగాహన కూడా కలిగిస్తాయి. అనుభూతి మార్గం ఏర్పరుస్తాయి.

తన చెప్పుచేతల్లో ఉండే తన మనస్సు తన ఆలోచనలు తన స్వాధీనంలోంచి జారిపోతున్నట్లు అనిపించసాగింది.




భర్త ముఖంలో ఆందోళన పోయి ప్రసన్నత చోటుచేసుకోవటం గుర్తించిన సుజాతలో ఆరాటం తగ్గింది. భయం తగ్గింది.

''రవికి పెళ్ళీడు వచ్చింది'' అని రామారావు భార్య ముఖంలోకి చూశాడు. ఆమె ఔనన్నట్లు తల ఊపింది.

''పెళ్ళి చేయాలి'' అంటే ఔనౌను అన్నట్లుగా తల ఊపింది.

''స్త్రీ పురుష అవయవ నిర్మాణం భార్యాభర్తలు కాబోయే యువతీ యువకులకు తెలియటం అవసరమే!'' అని భర్త అంటే ఆమె సంతోషంగా చూసింది.

రవిని భర్త మందలించడని, కొడుకు బాధపెట్టే పరిస్థితి ఉండదని సుజాత గుర్తించి సంతోషంగా ఉంది.

ఈ పుస్తకాలు వీడెందుకు చదువుతున్నాడని దిగులు. బాధ, కోపం తెచ్చుకొన్న రామారావులో మార్పు వచ్చింది.

రవి ఈ పుస్తకాలు, తాను కొని తెచ్చి చదవటంతో పాటు, ఇంట్లో ఉంచటం వల్ల తాను సంపూర్ణంగా సమగ్రంగా చదవగలగటం కూడా మంచిదే అయిందని, భర్త వాటిని చూడటం వల్ల తుఫాను చెలరేగుతుందనిపించినా అదేమీ లేకపోగా, భర్త పరిస్థితులు బాగా అంచనా వేసుకోవటానికి వీలయిందని, కొడుకు పెళ్ళి అవసరం తండ్రికి అర్థమైందని సుజాత సంతోషంగా ఉంది. ప్రసన్నంగా నవ్వుతూ ఉంది.

రామారావు ఆరాటం తగ్గి ఆటుపోటులు మాయమై, తేటగా తేరుకొని 'రవి మంచి పనే చేశాడు' అన్నాడు. అవునన్నట్లు నవ్వుతూ తల ఊపింది సుజాత.

''పెళ్ళయ్యాక, భార్యతో అన్యోన్యంగా ఉండటానికి, ఆమె అవసరాలు గుర్తించి మసులుకోవటానికి, ఆమెను సుఖపెడుతూ తాను సుఖపడటానికి. పెళ్ళికి ముందే, రవి ఈ సాహిత్యం చదవటం మంచిదే!'' అన్నాడు రామారావు.

సుజాత సంతోషంగా తల ఊపుతూ నవ్వింది. ఆమె ఏదో చెప్పబోతూ ఉందని అతడికి అనిపించింది.

సుజాత పెద్దగా నవ్వింది. ఏమయినా చెప్పబోయేటప్పుడు ఆమె అలా నవ్వుతుంది. నవ్వు పంచదార, మాట మందు.

''ఏమిటి చెప్పు'' అన్నాడు ముద్దుగా రామారావు.

రామారావు తల నిమురుతూ సుజాత చెప్పింది

''ఇప్పటికయినా ఈ సాహిత్యం మీరూ చదవటం మంచిదే!''

☆